# లంచం

నాగమణి



"పార్వతీ! ఎందుకు ఫోన్ చేయించావ్! అరె! అదేమిటే బాబుకి ఏం జరిగింది" పార్వతి ఒళ్ళోవున్న కుఱ్ఱాణ్ణి చూస్తూ ఆదుర్దాగా అడిగాడు రామం.

"ఏమీ లేదండి! పాలుపట్టి పడుకోబెట్టాను. అంతే! ఏరుపొచ్చినట్టు పడిపోయాడు" బాధగా అంది పార్వతి. కుఱ్ఱాణ్ణి చూస్తూ.

"అయితే డాక్టర్ని తీసుకొస్తాను" చెప్పుతేసు కోబోయాడు రామం.

"అక్కర్లేదండి! మన డాక్టరొచ్చి రెండు యింజక్షన్లిచ్చి వెళ్ళారు"

"ఏం చెప్పారట" పార్వతివక్కన కూర్చుంటూ అడిగాడు.

"ఒక అరగంట చూడమన్నారు! ఈలోగా తెలివిరాకపోతే......" ఇంక ఆ పై మాటలు రాలేదు. పార్వతికి దుఃఖం ముంచుకొచ్చింది.

"పారూ! యిప్పుడేం జరిగిందని అల్లా బాధపడతావ్! ధైర్యంగా వుండు"

"ఏమండీ! నాకెందుకో భయంగావుందండి"

"విదేశాలువెళ్ళొచ్చిన పెద్దడాక్టరే అల్లా చెప్పినప్పుడు మనం ఏం చెయ్యగలం చెప్పు! ఇంక ఆ భగవంతుడే రక్షించాలి" పార్వతి వీపు రాస్తూ ధైర్యం చెప్పాడు రామం.

"ఏమండీ! ఒకపని చేస్తారా.' ఆశగా రామం కేసి చూస్తూ అడిగింది పార్వతి.

"ఏమిటే! చెప్పుపార్వతీ"

"మరేంలేదు. ఈ గండం గడిచి గట్టెక్కింత మని దేముడిపేర ఒక వంద రూపాయలు ముడుపు కట్టండి.

"పారూ! ఏమిటి నువ్వనేది! దేవుడికి లంచమా!" ఆశ్చర్యపోతూ అడిగాడు రామం.

"అది లంచం ఏమిటండీ! మనం భక్తితో యిచ్చేది"

"పిచ్చిదానా! మనస్ఫూర్తిగా దేవుడ్ని కొలిస్తే చాలదూ! చిత్తశుద్ధితో నువ్వు పూజించేటప్పుడూ, కొలుస్తున్నప్పుడు ఇంకా ప్రతిఫలంగా డబ్బియ్యటం ఎందుకూ? డబ్బిచ్చి భక్తి కొనుక్కుంటావూ."

"మీకు తెలియదండి. భక్తులనుంచి దేవుడు ప్రతిఫలం ఆశిస్తాడు"

"ప్రతిఫలం అనేకన్నా 'లంచం' అంటే బాగుంటుంది పార్వతీ' కాని! నాకందులో నమ్మకంలేదు. నేను దేముడ్ని ఆత్మసాక్షిగా పూజిస్తున్నా! కావాలంటే ఎన్నిపూజలైనా..."

మాటలమధ్యలో చిరాగ్గా అంది పార్వతి. "ఏమిటండి. పిల్లాడు చావుబతుకులమధ్య నుంటే మీ అర్థంలేని వాదాలు! మనకి పిల్లాడు దక్కాలంటే యిదొక్కటే మార్గం. వంద రూపాయల కోసం చూడకండి. వీడు బతికి బట్టకడితే మనకదే చాలు. నామాట విని ముడుపుకట్టండి"

"పార్వతీ!" పిచ్చిగా అరిచాడు రామం.

"పారూ! వీడంటే నీకెంత ప్రేముందో నాకూ అంతే. ఈ క్షణాన ఏ డాక్టరేనావచ్చి "లక్ష రూపాయలిస్తే నీ కొడుకుని బ్రతికిస్తా" ననమను నేనివ్వటానికి సిద్ధం... కాని! నేను ఈ లంచం మాత్రం యివ్వను. పార్వతీ! లంచంగురించి నాకెంత చెడ్డ అభిప్రాయం వుందో నీకుతెలుసు. వాడికి ఆయుష్షువుంటే బతుకుతాడు లేకపోతే లేదు అంతేకాని... నేను లంచం యివ్వను" అక్కణ్ణుంచి లేచి దొడ్డివైపుకి వచ్చాడు రామం.

పార్వతి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"లంచం" గొణుక్కున్నాడు రామం చెట్టు క్రింద కూర్చుంటూ. లంచం ఎవరు పుచ్చుకుంటారో తనకి తెలుసు. అజ్ఞానులు. మూర్ఖులు... మరి... దేవుడి మాటేమిటి. దేముడుకూడా లంచం తీసికొంటాడా...?

లంచం ఎంత పాపిష్టిదో, నీచమైందో తనకి తెలుసు. ఇప్పుడు అడుగడుక్కీ లంచం. ప్రపంచం అంతా లంచం. అయినా తన చేతి మీదుగా ఎప్పుడూ, ఎవరికీ, ఎక్కడా ఒక్క పైసా లంచం ఇవ్వలేదు ఇవ్వనుకూడా అనుకొన్నాడు రామం.

"అసలు లంచం యివ్వటం అంటే ఎందుకో వీళ్ళకింత యిష్టం? ప్రతీదానికి లంచం. "లంచం యివ్వకపోతే అసలు ఈ రోజుల్లో బతకలేం" అంటారు. అప్పుడు మటుకు! ఆ సంగతి తనకింకా బాగా గుర్తు. S.S.L.C పాసు అయి. కాలేజీలో సీటుకోసం అప్లయి చేశాడు. తీరా చేసి కాలేజీకి వెళ్ళి కనుక్కొంటే "కాళీలేవన్నాడు సూపరెంటు. ఆ విషయం మావయ్యతో చెపే' నే చూస్తా కాని రేపు నువ్వెళ్ళి ప్రిన్సిపాల్ని కలుసుకో" మన్నాడు.

మర్నాడు ప్రిన్సిపాల్ దగ్గరికెళ్ళి పేరు చెప్పగానే "ఓ రామారావంటే నువ్వేనా! అహ!

ఉత్తమ చికిత్స



ఏకారణముచేతనైనా దాంపత్య సౌఖ్యం అనుభవించ లేనివారు

20 పైసల స్టాంపుతో సంప్రదించండి.

సెక్సుస్పెషలిస్ట్

డా॥ ఎ. పూర్ణచంద్రరావు

N.D.F.N.F.U.(CEYLON) R.A.M.P.

(PWD క్వార్టర్సు) విజయవాడ-2. గవర్నరుపేట



శుభవార్త

★

డాక్టర్లకు సాధ్యంగాక వదలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావు పాటివారు సన్నగను, బలహీనులు బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్ఠు, బొల్లి, కేన్సర్, క్షయ, సంతానము లేనివారు కూడా శ్రీ యోగిగారిచికిత్స వలన సంపూర్ణఫలమును బడయగలరు. కావలసిన వారికి కాయకల్ప చికిత్స చేయబడును. ఈ చికిత్సవలన దేహములో వున్న వ్యాధులు తొలగిపోవుటయే గాక నూతన యౌవనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు ఒక రూపాయి పంపవలయును.

శ్రీ యోగాశ్రమము

పెదవాల్తేరు పోస్టు,

విశాఖపట్టణము


చాలా మంచి మార్కులొచ్చాయోయ్. ఏ గ్రూప్ కావాలి' అంటూ మొదలెట్టాడు.

చిన్న సీట్లు లేవన్నారు. ఈవేళ ఎల్లా వచ్చాయో ...? ఏమైనా సీటొచ్చింది. అంతే చాలు బహుశా నా మార్కులు చూసి యిచ్చుంటారు' ఆ సంగతే మావయ్య అంటే,

"నీ మొహం! నీ బోడిమార్కులు చూసి కాదు,

రెండువందలయిస్తే ఎవడికోసం యిస్తాడు" అన్నాడు.

ఆ మాటలు అప్పుడర్థమవకపోయినా తరువాత బాగా అర్థమయ్యాయి.

ఆ తరువాత; బి. ఎ. పేసయ్యాక వుద్యోగం కోసం అప్లయి చేస్తే యింటర్వ్యూ వచ్చింది. ఇంటర్వ్యూలో నా పేరు చెప్పగానే 'ఓ నువ్వా రామారావంటే! ఫస్ట్ క్లాస్‌లో పేసయ్యావ్ కదోయ్, వెరీ గుడ్. రేపువచ్చి జాయినవ్, ఏం" అన్నాడా ఆఫీసరు.

ఇంటర్వ్యూలో ఏవీ అడగనందుకు ఆశ్చర్యం. ఉద్యోగం వచ్చినందుకు ఆనందం ఒకేసారి కలిగేయి. ఫస్ట్‌క్లాసులో పాసవటం వృథా కాలేదని తనకి కాస్త గర్వంలాటిది కలిగింది కూడా,

ఆ మాటే అమ్మతో అంటే,

"ఏముద్యోగాలో, ఏమిటోరా నాయనా! కాలం మారిపోయింది. అయినా నీకుద్యోగం వచ్చినట్టు యిప్పుడే తెలిసిందికాని, నాకు నిన్నరాత్రే తెలిసింది" అంది.

"ఇంటర్వ్యూ యివాళయితే నీకు రాత్రేఎలా తెలిసిందమ్మా! కలగాని కన్నావా"

"కలా, పాడా! రాత్రి మీ నాన్న ఆ ఆఫీసరును కలుసుకొని పదిహేను వందలు ముడుపు చెల్లించారుగా. వుద్యోగం రాకేం చేస్తుంది" అంది అమ్మ.

ఆ మాట వినగానే ప్రపంచం తిరుగుతున్నట్టనిపించింది.

ఆ తరువాత అడవిలో వుద్యోగం చేస్తున్నప్పుడు, "అంత దూరంలో ఎందుకురా" అని అమ్మ, నాన్న ఒకటే గోల. దానికితోడు పార్వతి కూడా' ఈ అడవిలో వుద్యోగం ఏమిటండీ! ఒకసరదా లేదు చలుబండిలూ లేదు. నేనుండలేను బాబూ అంటూ గొడవచేసేది.

"పోనీ! నాకుమాత్రం యిక్కడుండటం యిష్టమా! ఏంచేస్తాంచెప్పు వీళ్ళు ట్రాన్స్‌ఫర్ చెయ్యరు" అంటే,

"చెయ్యరని కూర్చుంటే ఎల్లాగండీ! ఏదో విధంగా ప్రయత్నం చెయ్యాలిగాని, అవసరం అయితే నాలుగు డబ్బులేనా యిచ్చి..."

"పార్వతీ! ఆ మాటమాత్రం అనకు. నేను చచ్చినా లంచంయివ్వను. చూస్తూవుంటే నా జీవితం అంతా ఈ లంచాలతోనే గడిచేలావుంది. ఈ లంచం ముందు ఫస్ట్ క్లాస్ డిగ్రీ తెలివితేటలు అన్నీ తుడిచిపెట్టుకుపోయాయి' ఉక్రోషంగా అనేవాడు తను.

పార్వతి అనునయిస్తున్నట్టు "చూడండి: లంచంయివ్వటం నాకు మాత్రం యిష్టమా! కాలానుగుణంగా పోవాలికాని. మీకా ఆశయం వుండటం మంచిదే! అల్లాగని మడిగట్టుకు కూర్చుంటే అసలు బ్రతకలేమండి" అనేది.

నాలురోజులుపోయాక, ఆఫీసరు పిలుస్తున్నాడని కబురువస్తే వెళ్ళాడు, ఆఫీసరే ముందు విష్ చేసి,

"హల్లో రామారావ్! కమిన్, కమిన్. టేక్ యువర్ సీట్! అవునూ, నీకు ట్రాన్స్‌ఫర్ కావాలని నాతో ఎప్పుడూ చెప్పలేదేమయ్యా! అంత మొహమాటమయితే ఎల్లాచెప్పు! నిన్న మీ బ్రదర్ చెప్పేదాకా నీకీవుద్దేశ్యం వున్నట్టు తెలీదనుకో! మీ బ్రదర్ వున్నాడు చూశావ్, బలేవాడయ్యా. గొప్ప విట్టీగా మాట్లాడతాడనుకో. అయినా, B. E. అయిపోయిన అతన్ని అలా పనిలేయటం నాకునచ్చలేదోయ్. మనాఫీసులోకే లాగిద్దాం. ఏమంటావు, సరేగాని! Anyhow. నీకు ట్రాన్స్‌ఫర్ అయిందోయ్. ముందిచెప్తే యీపాటికి మీవూళ్ళోవుండేవాడివి,

"చాలా సరదాగా మాట్లాడేడు,


లంచం యివ్వక్కర్లేకుండా బదిలీ అయినందుకు సంతోషం కట్టలుతెంచుకొంది. ఆ ఆనందంతో యింటికొచ్చి తమ్ముడ్ని పిలిచి—

"ఒరేయ్! చిన్నవాడివైనా భలే తెలివిరాపీది. అవునుగాని నీకు మా ఆఫీసరెలా తెలుసురా! ఓ, నీ గురించి తెగచెప్పాడ్రా! నువ్వు బలేగా...

"ఆగరా! బాబు! దానికుందిలే కథ" అంటూ నా ప్రవాహాన్ని అడ్డేశాడు. "మొన్న మీ ఆఫీసరుకూతురు పెళ్ళయిందిచూడూ, అప్పుడు నీ పేరుచెప్పి పరిచయం చేసుకుని, రెండు బియ్యం బస్తాలు, వెండిదట్టా ఒకటి, కూరలు యింకా..."

అంతే: తన కళ్ళల్లో నీరు సుడులుతిరిగింది.

తనసంగతి ఒక్కటేకాదు రోజూ ఎంతో మంది లంచం యిస్తారు. సారాకొట్టు అప్పాయమ్మ, ఆడవాళ్ళతో లాడ్జి నడుపుతోన్న వీర్రాజు పోలీసులకి లంచం యిస్తారు. కిరాణా కొట్టు ఆదిబాబు టాక్సాఫీసరుకి లంచం యిస్తాడు. నాయుడుగారి అబ్బాయి పరీక్షలు పాసవటానికి ఆయన లంచం యిస్తూంటాడు. కంట్రాక్టర్ సుబ్బారావు టెండర్లకోసం లంచాలు యిస్తాడు. బ్లాక్‌మార్కెట్ చేస్తున్న అయ్యన్నని యిన్‌స్పెక్టరు పట్టుకుంటే లంచం తీసుకొంటున్న యిన్‌స్పెక్టర్‌ని సి. ఐ. డి రాఘవులు పట్టుకొన్నాడు. అయ్యన్న ఇన్‌స్పెక్టర్‌కి, ఇనస్పెక్టరు రాఘవులికి లంచం యివ్వటంవల్ల అసలు ఏ కేసూ




ఆదివారం (18-5-69) న అమెరికా ప్రయోగించిన అపోలో—10 యాత్రికులు
యూజీన్ ఏ సెర్నాన్, జాన్ డబ్ల్యు. యంగ్, థామస్, పి స్టాఫర్డ్

లేకుండాపోయింది. ఇల్లాటి వుదాహరణలు కోకొల్లలుగావున్నాయి ఈ ప్రపంచంలో...

ఆలోచిస్తున్న రామం తటాలున ఈ లోకంలోకి వచ్చాడు పార్వతి కేకలతో.

"ఏమండీ, ఏమండీ! బాబుకి తెలివొచ్చిందండీ. బాబుకి తెలివొచ్చింది" పిచ్చిఆనందంతో రామం భుజం వూపేస్తుంది పార్వతి.

"ఆఁ" అంటూ ఆనందంగా యింట్లోకి పరిగెట్టాడు. బాబు నీరసంగా కళ్ళుతెరిచి రామం వేపు చూస్తున్నాడు.

"బాబూ" అంటూ హృదయానికి హత్తుకొన్నాడు. పార్వతివేపు తిరిగి "చూశావా పార్వతీ? అంతా ఆ భగవంతుడి దయ. భక్తితో తప్పుడుపులతో దేముణ్ని కొనలేం పార్వతీ. అలా అయితే ప్రతివాళ్ళూ ముడుపులతో పని చేయించుకొంటారు. అప్పుడు దేముడికి, మానవుడికి తేడా ఏంవుంటుంది చెప్పు పార్వతీ!" అంటూ ఏదో చెప్పేస్తున్న భర్తని జాలిగా చూసి,

"క్షమించండి! మీమాట కాదని ఈ పని చేసినందుకు. కాని! బాబుకోసం ఈ పని చేయవలసి వచ్చింది' తలవంచుకొని చెప్తూ, రామం చేతిలో ఒకపొట్లం వుంచింది పార్వతి.

కంగారుగా పొట్లంవిప్పిన రామానికి పసుపు గుడ్డలో కట్టిన బాబు గొలుసు. వందరూపాయల నోటు నవ్వుతున్నట్లనిపించింది.

వాటికేసి వెర్రిగా చూస్తూ వుండిపోయాడు. పాపం రామం.